



“మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం” అని అడిగిన సుందరి మాటలకు చెక్కారావు ఉలిక్కిపడి తల పైకెత్తి ఆశ్చర్యంగా ఆకాశంకేసి చూశాడు.

సుందరికి మండుకొచ్చి, టెంకి మీద ఒక్క మొట్టికాయ ఇచ్చుకుంది. “అమ్మో” అన్నాడు చెక్కారావు తలను గోక్కుంటూ. గుర్రుగా చూసింది సుందరి.

“హి...హి... నాకేం దెబ్బ తగల్లేదుగా. ఊరకే అలా గోక్కుంటున్నానన్నమాట” అన్నాడు చెక్కారావు.

“నేను పెళ్ళి సంగతి అడుగుతుంటే నువ్వు ఆకాశం వైపు చూస్తున్నావేమిటి? నన్ను మోసం చేయాలనుకుంటున్నావా? మా నాన్న అసలు సిసలైన మనిషి. ఒక్కసారి చెప్పానంటే జీవితాంతం చిప్పకూడు తినిపిస్తాడు జాగ్రత్త” రుసరుసలాడింది సుందరి.

“నిన్ను నేనెందుకు మోసం చేస్తాను. నిన్ను ఇష్టపడి, చాలా చాలా కష్టపడి, ఎంతో నష్టపడి మరీ ప్రేమించాను. ఆకాశం వైపు ఎందుకు చూశానా అని కదూ అడుగుతున్నావు. ఆకాశం మబ్బులేకుండా ఉరుముతుందేమిటా అని చూస్తున్నానంతే!”

మరుక్షణంలో ఉరుములు ఉధృతం ఎక్కువైంది. ఇద్దరు కంగారుపడ్డారు. సుందరికి ఆ శబ్దాలు అర్థమైపోయి నోరు తెరవేటప్పటికీ వారి ప్రక్కనే పిడుగుపడిన శబ్దం.

చెక్కారావు భయంతో అరచి “బాంబు, బాంబు” అని అరుస్తూ పరుగందుకున్నాడు. చెక్కారావు కేకలకు ఆ పార్కులోని జనం పడుతూ లేస్తూ ఎవరికి దొరికిన దారి వెంట వాళ్ళు పరుగెడుతున్నారు.

కానీ, సుందరికి పారిపోయే అవకాశం చిక్కలేదు. ఆ పిడుగులాంటి శబ్దం చేసింది గున్న ఏనుగులాంటి సుందరి ప్రక్కింటి ఆంటీ. సుందరిని పార్కులో పరాయి మగాడితో చూసి గబగబా వచ్చి దభీమని వారి ప్రక్కన కూర్చున్న శబ్దానికి చెక్కారావు పారిపోయాడు. కానీ, సుందరిని గట్టిగా పట్టుకున్నది గున్న ఏనుగు శాల్తీ నాంచారి.

కిలోమీటర్ దూరం పారిపోయిన చెక్కారావుకు అప్పుడు సుందరి గుర్తుకొచ్చి గబగబా వెనక్కి తిరిగి వచ్చేటప్పటికి పార్కులో ఎవరు లేరు. ఓ చెట్టు కింద సుందరి నాంచారీలు కూర్చుని వుండటం నక్కినక్కి చూశాడు.

అమ్మయ్య సుందరి బతికే వుందనుకుని మెల్లగా వచ్చాడు.

“నువ్వు బాంబు అని పారిపోయావు కదూ! బాంబు కాదు. ఈమె వచ్చి కాస్త గట్టిగా కూర్చున్నదన్నమాట. ఈమె మా పక్కింటి ఆంటీ” అని పరిచయం చేసింది సుందరి. నమస్కారం చేశాడు

## నాంచారి

చెక్కారావు.

అంతే, నాంచారి విజృంభించింది. ఆమెకు అవకాశం చిక్కింది.

“చూడచక్కని జంట. ఎంత ముచ్చటగా వున్నారో! ముచ్చటగా మూడు కథలు చెబితే ఆనందంగా వినాలని వుంది. కథలు విని చాలా కాలమైంది. చెప్పండి చెప్పండి” ఉబలాట పడింది నాంచారి.

“నేను అర్జంటుగా వెళ్ళాలి సుందరి. వస్తా మరి” అన్నాడు చెక్కారావు భయంగా.

“వెళ్ళ వచ్చు లేవోయనా! నేను రాకపోతే సాయంత్రం వరకు ఇలాగే— కూర్చుని కాకరకాయ కబుర్లు చెప్పుకునే వాళ్ళు కదా! మీకు కథలు చెప్పడం రాకపోతే నేనే చెబుతాను. కాదు కూడదు అంటే రాత్రికి మీ ఇంట్లో మీటింగ్ పెట్టి మొత్తం వివరిస్తాను. ఏమంటావ్ సుందరి” బెదిరించింది.

సుందరి జాలిగా చెక్కారావు వైపు చూసింది.

నేను ఇవాళ ఇలా బలి కావలసిందేనా అని కళ్ళతోనే ప్రశ్నించాడు చెక్కారావు.

“మీరలా కళ్ళతో సైగ చేసుకున్నా నాకర్థం అవుతుంది. తప్పదు కాక తప్పదు” ఖచ్చితంగా చెప్పింది నాంచారి.

“ఆంటీ ఆంటీ మా అమ్మకు తెలియకుండా ఎన్నిసార్లు మీకు పంచదార ఇచ్చాను. ఎన్నిసార్లు కాఫీ పొడరు ఇచ్చానో గుర్తుందా? ఒక్కసారి వాటిని గుర్తు తెచ్చుకుని మమ్మల్ని వదిలెయ్యండి ప్లీజ్” బతిమాలింది.

“ప్రస్తుతానికి నాకేం గుర్తు రావడం లేదు. కూర్చోమని” శాసించింది.

“ఈసారి రేషన్ షాపునుండి తేగానే అరకిలో పంచదార మా అమ్మకు తెలియకుండా ఇస్తా కదా!”

“అయినా సరే కూర్చుని నా కథలు వినమని




చెప్పు. నాకసలే కోపం ఎక్కువ” మొండిగా చెప్పింది నాంచారి.

చెక్కారావు విధిలేక బలి పశువులా, ఆముదం తాగిన మొహం పెట్టుకుని ఆమె ముందు కూర్చున్నాడు.

నాంచారి గొంతు సవరించుకున్నది కథ చెప్పటానికి రడీ అవుతూ.

ఓసి మహమ్మారి. నీ కథల గోల పడలేక నీ మొగుడు ఆత్మహత్య చేసుకుని అయినా వుండాలి లేదా సన్యాసుల్లోనైనా కలిసిపోయి వుండాలి. గొణిగాడు చెక్కారావు.

“ఇదిగో చెక్కారావ్! కథ చెబుతుంటే మధ్య

లో గొణిగినా, అడ్డు చెప్పినా నాకు పూనకం వచ్చినంత కోపం వస్తుంది మరి'' హెచ్చరించింది నాంచారి.

''అలాగే అలాగే'' అంది సుందరి భయంగా చెక్కారావు వైపు చూసి వెనుక చెట్టును అనుకుంటూ.

''నీ నోరుపడిపోను, నీకు మాయరోగం రాను. ఇవాళ ఉదయం లేవగానే ఎవరి మొహం చూశాన్రా భగవంతుడా. ఇంకెవరి మొహం నా మొహమే అద్దంలో చూసుకుని వుంటాను అని అనుకుని హి...హి... అన్నాడు కాస్త మొహాన నవ్వు పులుముకుని.

''అమ్మయ్య. ఇప్పుడు నాకెంత ఆనందంగా వుందో! అనగనగా ఓ ఊరిలో ఓ కోతి వుందంట. ఒకవాడు ఆ కోతి కాలిలో ముల్లు దిగిందట....

నాంచారి నోటికి తాళం లేకపోయింది. ఆమె అలా చెబుతుంటే రోడ్డు రోలర్ని కంకర మీద దొర్లించినట్లుగా వుంది. ఆ రణగొణ ధ్వని భరించలేక ఇద్దరు సతమతమవుతున్నారు.

చెక్కారావు పరిస్థితి మరీ ఘోరంగా వుంది. సుందరి కోసం గ్లాసుడు విషాన్ని హాయిగా తాగగలడు. రోహిణీ కార్తెలో సైతం చెప్పులు లేకుండా ఎడారిలో హాయిగా విహరించగలడు. సప్తసముద్రాలను సంతోషంగా ఈదగలడు. తుమ్మ ముళ్ళ మీద పక్క వేసుకుని గుర్రు పెట్టి నిద్రపోగలడు. కానీ ఈమె చెప్పే కథలను మాత్రం భరించలేకపోతున్నాడు.

అసలీ శబ్దం ఈమెకెలా వచ్చింది? కొంపతీసి చిన్నప్పుడు కంకర తినలేదు కదా అనుకున్నాడు.

నాంచారి కథ పూర్తి చేసి మరీ అడిగింది ''ఎలా వుంది కథ'' అని.

''ఎంతో బాగుంది'' అన్నాడు చెక్కారావు పళ్ళునూరుతూ. సుందరి కూడా నవ్వి బాగుందని చెప్పడంతో మరింత విజృంభించి మరోకథ చెప్పింది. సుందరికి ఓపిక నశించి నీరసంతో వేలాడిపోయింది.''

ఈసారి కథ బాగుంది అని చెప్పటానికి ఓపిక లేక చేతితోనే సైగ చేశారు.

నాంచారికి శోష వచ్చి అటుగా వెళుతున్న సోడాల వాడిని పిలిచింది. మంచి కష్టమర్లు దొరికారనుకుని వాడు పరుగు పరుగున వచ్చి ముగ్గురికి సోడాలు కొట్టి అందించాడు ఆనందంగా. సుందరి, చెక్కారావు కొంచెం తేరుకున్నారు. వాడు సోడాలు కొడుతూనే వున్నాడు. నాంచారి తాగుతూనే వుంది. వాడి దగ్గరున్న సోడాలన్నీ తాగి బ్రేవ్‌మని తేన్చి ''ఏ సోడాలో గ్యాస్ లేదు పాడు లేదు'' అన్నది. వాడు కయ్‌మన్నాడు గ్యాస్ లేదన్నందుకు.

వాడికి డబ్బులిచ్చి వదలక ''కథ చెబుతాను వింటావా?'' అన్నది.

''అబ్బా కథలు వినడం కంటే చెప్పడం నాకు చాలా ఇష్టం'' అన్నాడు వాడు సంతోషంగా భుజాలు ఎగరేస్తూ.

సుందరి, చెక్కారావు అమ్మయ్య అనుకున్నారు తమని వదిలినందుకు.

''అయితే చెప్పు చెప్పు. కథలు వినక చెవులు తుప్పుపట్టాయి'' అంటూ అతని భుజాలు పట్టుకుని మరీ కూర్చోబెట్టింది నాంచారి.

అతను కూర్చున్నాడు.

''ఈ మాయదారి రోగం వలన కథలు చెప్పమని మా ఆయన్ని వేధించి, వేధించి మరీ దూరం చేసుకున్నాను'' తనని తానే నిందించుకున్నది నాంచారి.

''అయితే మీ ఆయన లేడా?'' అన్నాడు సోడాలవాడు.

వాడి ప్రశ్నకు నాంచారి మొహం గంభీరంగా మారిపోయింది. ముక్కు చ్రున చీదింది.

''ఏడ్చే వాళ్ళకు నాకు కథలు చెప్పబుద్ధి కాదు. నే వస్తా'' అన్నాడు వాడు.

''ఛఛ ఏడవడం లేదు. మా ఆయన గుర్తుకొచ్చి కథలు వినే వాళ్ళు లేక బాధ పడుతున్నాను. ఇప్పుడు నీ ఆసక్తి చూసి ఆనందం భాష్పాలు వచ్చాయి అంతే!'' చెప్పింది నాంచారి.

వాడు నోరు తెరిచాడు. రైలు పట్టాల మీద నూట యాభై కిలోమీటర్ల వేగంతో బ్రిడ్జీలను దాటుతుంటే వచ్చే శబ్దం వస్తున్నది. నాంచారి నోరు తెరచి ఆనందంగా వింటున్నది.

సుందరి, చెక్కారావు తమను పట్టించుకోనందుకు హాయిగా నిట్టూర్చి అడుగులో అడుగు వేసుకుంటూ దూరంగా వున్న ఐస్ పార్లర్‌లో కూర్చుని చెరొక కూల్ డ్రింక్ తీసుకుని మాటల్లో పడ్డారు.

పది నిముషాల తర్వాత కనబడిన దృశ్యం చూసి నోరెళ్ళ బెట్టారిద్దరు. అక్కడ నాంచారి వెల్లకిలా పడి నాలుక బయటకు పెట్టి రొప్పుతున్నది. సోడాలవాడు రెచ్చిపోయి కథల మీద కథలు చెబుతున్నాడు. మరో నిముషం తరువాత ఆమె కాళ్ళు చేతులు దబదబామని బాదుకుంటున్నది. అయినా వాడు కథల్ని ఆపడం లేదు. కాస్త మీరైనా వెళ్ళి వాడిని ఆపి నాంచారిని రక్షించండి బాబూ! ■

# జగమంతా వింతల మయం

## 'మగ' పెళ్ళి 'కూతురు'

కొంతమంది ఇళ్ళలో మగపిల్లలకి గౌనులు, ఆడపిల్లలకి చొక్కా, నిక్కర్లు తొడిగి సరదా తీర్చుకొంటూ వుంటారు. అంత వరకూ అయితే పరవాలేదు. ఎప్పటికీ అలాగే పెంచితే ఇబ్బందే మరి! చైనా దేశంలో 'హింగ్ షాయి' అనే ప్రాంతంలో ఒక భార్యా భర్తలున్నారు. వారికి కొడుకు పుట్టాలని తెగ ఆశగా వుండేది. వారి ఆశకు తగ్గట్టుగా, ఇద్దరు మగ పిల్లలు పుట్టి చనిపోయారట. మూడోసారి ఆడపిల్ల పుట్టింది. ఆ విషయం ఎవరికీ తెలియనీయకుండా, మగపిల్లాడు పుట్టాడని చెప్పి అదే రీతిలో పెంచటం ప్రారంభించారు. మాట్లాడేతీరు, నడక అన్నీ ఆడపిల్లలా ఉండేసరికి ఎవరూ అనుమానించలేదు. చివరకు ఆ 'ఆడ అబ్బాయికి' పాతిక సంవత్సరాలు వచ్చాయి. ఈడు వచ్చాక పెళ్ళి చెయ్యాలి కదా! ఒక అందమైన అమ్మాయిని తెచ్చి పెళ్ళి కూడా జరిపించారు. లింగభేదాన్ని ఎక్కడ దాచిన పడక గదిలో దాచటం కష్టం కదా! మొదటి రాత్రిలో అసలు రహస్యం బయటపడేసరికి ఆ పెళ్ళి కూతురు లబోదిబోమని ఏడవటం మొదలుపెట్టిందట పాపం!

## 'దుంపల' ఆహారం

పూర్వం కొండల్లోను, అడవుల్లోను నివసించే ప్రజలు, ఆకులు, అలములు, దుంపలు తిని బ్రతికేవారు. కానీ ఈ రోజుల్లో నగరంలో నివసించే వ్యక్తులు కేవలం దుంపలే ఆహారంగా తిని బ్రతుకుతున్నారంటే విచిత్రమే మరి! బొంబాయి నగరంలోని 'కొలాబా' ప్రాంతంలో నివసిస్తున్న 'నవరోజ్ షారూ' అనే పది సంవత్సరాల బాలుడు కేవలం బంగాళా దుంపలు మాత్రమే తింటాడట. రోజుకీ కాని, మరి ఏ ఇతర పదార్థం పెట్టినా వెంటనే వాంతు చేసుకొంటాడట. బంగాళా దుంపతో ఎన్ని రకాల వంటకాలు చేసినా 'ఇంకొంచెం ఇంకొంచెం' అంటూ లాగించేస్తాడట. సంవత్సరం వయస్సునుంచి అతని పద్ధతి అలాగే వుంది. ఒక తిండి విషయం తప్పించి మిగతా కార్యక్రమాలన్నీ అందరి పిల్లల్లాగానే చేస్తుంటాడు. అదొక లైఫ్!

— శర్మాజీ